ప్రజాశక్తి

బుధవారం 4 డిసెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణం జరిగేనా..?

- రుషికొండ వద్ద విఎంఆర్‌డిఎ చేస్తున్న ప్రయత్నాలు ఫలించేనా..
- గత అనుభవాల నేపథ్యంలో సర్వత్రా చర్చ



ఆర్‌కె బీచ్‌లో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి (ఫైల్ ఫొటో)


ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ సముద్ర తీరంలో ఫ్లోటింగ్ బ్రిడ్జిని నిర్మించడం ద్వారా పర్యాటకులకు నూతన అనుభూతిని కలిగించాలని విఎంఆర్‌డిఎ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయా ? లేదా ? అనే సందేహాలు తాజాగా అందరిలో వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ముందు వైసిపి ప్రభుత్వం గొప్పలకు పోయి ఆర్‌కె.బీచ్‌లో రూ.కోటీ 60 లక్షలతో నిర్మించిన ఫ్లోటింగ్ బ్రిడ్జి కొద్ది సేపటికే కొట్టుకుపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరి 25న ఫ్లోటింగ్ బ్రిడ్జిని రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి, నాటి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అట్టహాసంగా ప్రారంభించిన విషయం అందరికీ తెలిసిందే. వారు ప్రారంభించిన మరుసటి రోజునే ఫ్లోటింగ్ బ్రిడ్జ్ కొట్టుకుపోయింది. దీనికి ఏర్పాటు చేసిన 'టి' జాయింట్ విడిపోవడంతో ఇది కొట్టుకుపోయి నాడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో కొందరు నిపుణులను రప్పించి ఇదే ప్రాంతంలో ఫ్లోటింగ్ బ్రిడ్జిని నిర్మించాలని భావించారు. కొన్నాళ్ల తర్వాత నిపుణులు రావడం, పరిశీలించడం చకచకా జరిగాయి. అయితే ఆర్‌కె బీచ్ ప్రాంతంలో సముద్రం లోతుగా ఉంటుందని, అలల తాకిడి తీవ్రంగా ఉంటుందని, అందువల్ల ఇక్కడ ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణం సరికాదని వారు తేల్చి చెప్పారు. అప్పటికిగానీ విఎంఆర్‌డిఎ అధికారులకు తెలిసి రాలేదు. తొందరపాటు చర్యతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు చేసిన ఖర్చు సముద్ర జలాలలో కలిసిపోయినట్లేనని పర్యాటకులు విమర్శలు సైతం చేశారు. ఇక్కడ ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణం జరిగి ఉంటే ఒకేసారి 200 మంది పర్యాటకులు దీనిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని అప్పట్లో చెప్పారు. అయితే పర్యాటకులు దీనిని ఉపయోగించుకున్న సమయంలోనే ఫ్లోటింగ్ బ్రిడ్జి విడిపోవడం లేదా ముక్కలు కావడం జరిగి ఉంటే తీవ్రస్థాయిలో మిగతా 6లో..



ఏర్పాట్లును పరిశీలిస్తున్న విఎంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథన్

రేపు విశాఖకు సిఎం చంద్రబాబు రాక

- ఈ నెల 5, 6 తేదీల్లో విఎంఆర్‌డిఎ కార్యక్రమాలకు హాజరు
- ఏర్పాట్లలో ప్రభుత్వ యంత్రాంగం నిమగ్నం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో ఎన్నికల అనంతరం రెండోసారి విశాఖ నగరానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 5, 6 తేదీల్లో విచ్చేస్తున్నారు. ఉద్యోగ భవన్‌లో విఎంఆర్‌డిఎ అధికారులతో 5న సిఎం సమావేశం కానున్నట్టు విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్. విశ్వనాథన్ మంగళవారం రాత్రి మీడియాకు తెలిపారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు పర్యటనకు ఎలాంటి అవాంతరాలూ కలుగకుండా ముందస్తు ఏర్పాట్లలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే సిఎం పర్యటించే పరిసరాలను కమిషనర్, ఇతర అధికారులు పరిశీలించారు. రహదారులపై బిటి లేయర్ వేసి ఇతర మరమ్మతులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖ నగరాభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులను సిఎం చంద్రబాబు ప్రారంభించే అవకాశాలున్నాయి.

ల్యాండ్ పూలింగ్‌పై సిఐడి

వార్త 2లో..

ఎన్‌ఎడి ఉద్యోగుల కాగడాల ప్రదర్శన

వార్త 2లో..

వెంకటేశ్వర కాలనీలో.. ప్రేమ జంట ఆత్మహత్య

వార్త మెయిన్‌లో..

ధాన్యం కొనుగోళ్లు గాలికి..

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శ



మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను గాలికి వదిలేసిందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. తుపాను కారణంగా చేతికి వచ్చిన ధాన్యం తడిచిపోయి, కొనుగోలు చేసే వారు లేక రైతాంగం అల్లాడుతుంటే సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. మంగళవారం విశాఖ నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుపాను హెచ్చరికల తరువాత కూడా సిఎం చంద్రబాబు రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లపై కనీసం ఒక్క సమీక్షా సమావేశాన్ని సైతం నిర్వహించలేదన్నారు. పిడిఎస్ బియ్యం అంటూ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, సివిల్ సప్లయీస్ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు కాకినాడ పోర్టు చుట్టూ తిరగడానికే పరిమితమయ్యారన్నారు. రైతుల ఇబ్బందులను మరిచి డైవర్షన్ రాజకీయాలకే వీరు పరిమితమయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దళారులు మిగతా 2లో..

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించండి

విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అనకాపల్లి జెసి జాహ్నవి


ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో నడిచే అన్ని రంగాల్లో విభిన్న ప్రతిభావంతుల భాగస్వామ్యాన్ని, నాయకత్వాన్ని ప్రోత్సహించాలని, వారిని విశ్వ విజేతలుగా తీర్చిదిద్దాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, అనకాపల్లి జాయింట్ కలెక్టర్ జాహ్నవి వేర్వేరు కార్యక్రమాల్లో పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వం ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించగా వారు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి.



విశాఖలో విభిన్న ప్రతిభావంతుల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కీలక నిర్ణయాల్లో విభిన్న ప్రతిభావంతుల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు. 'సమగ్ర, స్థిరమైన భవిష్యత్తు కోసం వికలాంగుల నాయకత్వాన్ని విస్తరించడం' థీమ్‌తో స్థానిక వుడా చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు గొప్ప శక్తి సామర్థ్యాలను, పట్టుదలను కలిగి ఉంటారని, వారు చేస్తున్న పనులు, తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలే దీనికి నిదర్శమని పేర్కొన్నారు. వేదికపై పలువురు అంగవైకల్యం కలిగిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను చూసి మంత్రముగ్ధుడినైపోయానని, వారి శక్తి అమోఘమని ప్రశంసించారు. వారికి తగిన చేయూత, ప్రోత్సాహం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



అనకాపల్లిలో వికలాంగుల గ్రూపులకు రుణాల చెక్కు అందజేస్తున్న జెసి జాహ్నవి

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించండి

అందిస్తే మరింత ప్రతిభావంతులుగా తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. వికలాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. ఎంవి.శేషమ్మ మాట్లాడుతూ వికలాంగుల చట్టం - 2016లోని పలు అంశాలను విడమర్చి చెప్పారు. వికలాంగుల హక్కులకు చట్టబద్ధత ఉందని, వాటిని వినియోగించుకోవటం ద్వారా రాజ్యాంగం, ప్రభుత్వాలు వారికి కల్పించిన ప్రయోజనాలను పొందాలని హితవుపలికారు. విద్యా, వైద్యం, ఇతర రంగాల్లో లభించే ప్రయోజనాల కోసం, హక్కుల కోసం వికలాంగులతో పాటు వారి సంరక్షకులు, తల్లిదండ్రులు కూడా తెలుసుకోవాలని, అవసరమైన సమయాల్లో వాటి కోసం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విభిన్న ప్రతిభావంతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన శాలలను జిల్లా కలెక్టర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సందర్శించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిచిన 532 మందికి బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి జె.మాధవి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి రామారావు, డిఇఒ ప్రేమ్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ సూపరింటెండెంట్ పద్మావతి, సమగ్ర శిక్షా అధికారులు, వివిధ విద్యా సంస్థల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక వివి.రమణ రైతు భారతి పార్క్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఆంధ్రప్రదేశ్ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మల్ల సురేంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.6 వేల పింఛను ఇస్తోందని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ నుంచి బధిరులకు ఐదు టచ్ ఫోన్లు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వివిధ సంస్థల్లో వికలాంగులకు సేవలందిస్తున్న వాలంటీర్లను దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ ఆయేష, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు గాలికి..

పెట్రేగిపోతున్నారన్నారు. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాలో రోడ్ల పక్కన కిలోమీటర్ల మేర ధాన్యాన్ని రైతులు ఆరబోసుకుంటున్నారని తెలిపారు. గన్నీ బ్యాగులు దొరకక, లేబర్ అందుబాటులో లేక, రవాణా వాహనాలు సమకూరక ఎక్కడికక్కడ ధాన్యం పోగుపడిపోయాయని అన్నారు. తేమ పేరుతో రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. తుపాను వల్ల రైతుల కష్టం నీటిపాలవుతోందని నిత్యం పత్రికల్లో కథనాలు వస్తున్నా కూడా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవి రెడ్డి పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్‌పై సిఐడి

అక్రమాలపై విచారణ - రికార్డుల స్వాధీనం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

వైసిపి ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల పంపిణీకి చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అక్రమాలపై సిఐడి రంగంలోకి దిగింది. వైసిపి నాయకులు, వారి అనుచరులు ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్నట్లు కొంతమంది తమ పేర్లను రెవెన్యూ రికార్డులో నమోదు చేయించుకొని విలువైన స్థలాలు నాడు పొందారు. ల్యాండ్ పూలింగ్‌లో వియంఆర్‌డిఎ, రెవెన్యూ అధికారుల అవినీతిపై అప్పట్లో పెద్ద దుమారమే చెలరేగిందది. ప్రధాన పాత్రధారులైన అధికార పార్టీ నాయకులు ఈ వ్యవహారం బయటకు రాకుండా అడ్డుకోగలిగారు. తీవ్రమైన ఆరోపణలు వచ్చినా రెవెన్యూ అధికారులు మౌనందాల్చారు. అంతర్గత విచారణ చేపట్టి తప్పులు సరిచేసే ప్రయత్నం చేయలేదు. అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోలేదు. ల్యాండ్ పూలింగ్ ఆరంభం నుంచి స్థలాల అప్పగింత వరకు అక్రమాలు చోటుచేసుకున్నాయి. బినామీ పేర రికార్డుల్లో నమోదు చేయించుకొని లబ్ధిపొందినట్లు ఆరోపణలు వచ్చాయి. అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల మెప్పు కోసం చెప్పినదానికి తలూపి రెవెన్యూ అధికారులు సహాయపడ్డారు. గత ప్రభుత్వంలో జరిగిన ల్యాండ్ పూలింగ్ అక్రమాలపై విచారణకు సిఐడిని కూటమి ప్రభుత్వం రంగంలోకి దించింది. సిఐడి అధికారి నాగేంద్రభూపాల్ నేతృత్వంలోని బృందాలు అనకాపల్లి జిల్లాలోని పలు తహశీల్దార్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించాయి. అనకాపల్లి, సబ్బవరం, పరవాడ, కశింకోట మండలాల్లోని తహశీల్దార్ కార్యాలయాల్లో ల్యాండ్ పూలింగ్ రికార్డులను తమ వెంట తీసుకెళ్లినట్లు తెలిసింది.

ల్యాండ్ పూలింగ్ భూములు అభివృద్ధి చేసిన వియంఆర్‌డిఎ అధికారులు కొందరు ఈ అక్రమాల్లో కీలకంగా వ్యవహరించినట్లు తెలిసింది. బినామీ పేర్ల స్థలాలు పొందినట్లు ప్రచారం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఎన్నికలకు ముందు ల్యాండ్ పూలింగ్ భూములపై విచారణ చేపట్టాలని డిజిపికి ఫిర్యాదు చేసినా అప్పట్లో విచారణ జరగలేదు. కూటమి ప్రభుత్వంలో మళ్లీ ఫిర్యాదు చేయడంతో ల్యాండ్ పూలింగ్ భూముల అక్రమాలపై సిఐడి విచారణకు ఆదేశించింది.

సస్పెన్షన్ ఎత్తి వేయాలని..

ఎన్ఎడి ఉద్యోగుల కాగడాల ప్రదర్శన

ప్రజాశక్తి - గోపాలపట్నం : 36 మంది ఎన్ఎడి ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ ఎన్ఎడి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు ఎన్ఎడి ప్రధాన గేటు వద్ద నుంచి సాకేతపురం అంబేద్కర్ విగ్రహం వరకు మంగళవారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి నేవల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ రక్షణ రంగ కార్మికులతో పాటుగా విశాఖలో ఉన్న అన్ని కార్మిక సంఘాలు ఎన్ఎడి ఉద్యోగులకు జరిగిన అన్యాయంపై గొంతెత్తుతాయన్నారు. అందరం కలిసి పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఎన్ఎడి దీక్ష శిబిరం నుంచి బైక్ ర్యాలీ చేపడతామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాని కోరారు. ఎన్ఎడిసి యూనియన్ గౌరవ అధ్యక్షులు థామస్ మాట్లాడుతూ యాజమాన్యం చేసిన తప్పును ఇప్పటికైనా సరిదిద్దుకోవాలని కోరారు. భయపెట్టాలని, ఉద్యమాన్ని అణిచివేయాలని కక్ష సాధింపు చర్యలకు దిగితే సహించేది లేదన్నారు. కార్మికులు చేస్తున్న ఉద్యమానికి రోజురోజుకూ మద్దతు పెరుగుతోందన్నారు. బిసి యూనియన్ నాయకులు స్వామి ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు నూకరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రక్షణ రంగ కార్మికులు పాల్గొన్నారు.



కాగడాల ప్రదర్శనలో పాల్గొన్న ఎన్ఎడి ఉద్యోగులు

వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ఎయు విసి ఆచార్య జి.శశిభూషణరావు ఆకాంక్షించారు. మంగళవారం ఎయు కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో ది సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు 'టువార్డ్స్ ఇంక్లూషన్: ఎంపవరింగ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్ ఫర్ ఎ డెవలప్డ్ ఇండియా బై 2047'ను ప్రారంభించారు. సదస్సులో కీలకోపన్యాసం చేసిన యుజిసి జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ఆర్.మనోజ్‌కుమార్ మాట్లాడుతూ, సమ్మిళిత సమాజాన్ని నిర్మించడం విభిన్న ప్రతిభావంతులను భాగస్వాములను చేయడం ద్వారా మాత్రమే సాధ్యపడుతుందన్నారు. 2016 లో అమల్లోకి వచ్చిన విభిన్న ప్రతిభావంతుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఎయు విసి మాట్లాడుతూ వికలాంగులకు అనుకూలంగా ఉండేలా కార్యాలయాల నిర్మాణాలు జరగాలని సూచించారు. ఈ దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయం కృషి చేస్తుందన్నారు. అవకాశాలను అందిస్తే వికలాంగులు అవరోధాలను అధిగమించి, విజయాలను సాధిస్తారన్నారు.ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనంజయరావు మాట్లాడుతూ వికసిత్ భారత్



సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎయు విసి, ఇతర అధికారులు, అతిథులు

సాకారం కావాలంటే దేశంలోని వికలాంగులు సైతం సాధారణ వ్యక్తులతో సమానంగా ప్రగతి సాధించే దిశగా ప్రోత్సహిస్తూ అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుల హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. విశాఖపట్నం జోన్ 1 ప్రాంతీయ ఉపాధి అధికారి టి.అనిల్ కుమార్ మాట్లాడుతూ వికలాంగుల నైపుణ్యాభివృద్ధికి తమ సంస్థ కల్పించే కార్యక్రమాలను వివరించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ. రాణి తాను గ్రూప్ వన్ అధికారి కావడానికి చేసిన ప్రయత్నాన్ని, ప్రయాణాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన వ్యక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించే వేదికగా ఈ సదస్సు నిలుస్తుందన్నారు.ఈ సందర్భంగా అతిథులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

పౌర గ్రంథాలయ అభివృద్ధికి సహకారం



పాఠకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ప్రజాశక్తి- సీతమ్మధార : ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీని మంగళవారం విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా పోటీపరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థులు, నిరుద్యోగులతో మాట్లాడారు. పబ్లిక్ లైబ్రరీలో సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువు కోడానికి లైబ్రరీ ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. గ్రంథలయాభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిఎస్ఆర్ ప్రసాద్, గ్రంథాలయం కార్యదర్శి వర్మ, కూటమి నేతలు మాజీ కార్పొరేటర్ రాజు, వార్డు జనసేన అధ్యక్షులు చంటి, శివప్రసాద్, రాకేష్ పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ సోమరాజు మృతి



నివాళులర్పిస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి- తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్, సిపిఐ నాయకుడు తూతిక సోమరాజు (84) మంగళవారం మధ్యాహ్నం తగరపువలసలోని తన స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, ఇతర నేతల బృందం అతని మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ రెండుసార్లు సిపిఐ తరుపున భీమిలి మున్సిపల్ కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వహించారు. చిట్టివలస జ్యూట్‌మిల్లులో మెకానికల్ విభాగంలో పనిచేస్తూ యూనియన్ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారన్నారు. ఆయన మరణం పార్టీకి, యూనియన్‌కు తీరనిలోటని నివాళులర్పించారు. సోమరాజు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిపిఐ, ఎఐటియుసి నేతలు అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల రాంపైడి, చిల్ల అప్పలసూరి, మావూరి సన్యాసమ్మ, వీర్రాజు,నూలు ఆదినారాయణ, ఎరుసు అప్పలనరసయ్య, పల్లా లక్ష్మణరావు, వానపిల్లి సత్యం ఉన్నారు.

రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాశక్తి- మాధవధార : వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఎపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒబిసి విభాగం పరిశీలకులు మూల వెంకటరావు అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్య్రం వచ్చి 77ఏళ్ల, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 73ఏళ్ల కావస్తున్నా రాజ్యాంగం కల్పించే హక్కులు వికలాంగులకు అందడం లేదన్నారు. వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తే, తమ హక్కులు, అవసరాలపై వారు చట్టసభల్లో ప్రశ్నించి, గళమెత్తి సాధించుకోవడానికి వీలుంటుందన్నారు. వికలాంగుల సంక్షేమంపై ప్రభుత్వం, నేతలు ఊకదంపుడు ఉపన్యాసాలే తప్ప, ఆచరణలో అవేవీ అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులపై దృష్టిసారించి, వారి సమస్యల పరిష్కారం, సంక్షేమంతోపాటు రాజకీయ రిజర్వేషన్లు కల్పనకు చర్యలు చేపట్టాలని వెంకటరావు డిమాండ్ చేశారు.

క్రాస్ కంట్రీ ఆయిల్ పైప్‌లైన్

చోరబాట్లను గుర్తిస్తే నగదు నజరానా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇండియన్ ఆయిల్‌కు చెందిన క్రాస్‌కంట్రీ ఆయిల్ పైప్‌లైన్ చోరబాటుకు ప్రయత్నించిన దుండగుల గురించి సమాచారాన్ని పంచుకునే సాధారణ ప్రజలకు ఇండియన్ ఆయిల్ సంస్థ రివార్డు ప్రవేశపెట్టిందని ఆ సంస్థ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఆయిల్ భూగర్భ క్రాస్-కంట్రీ పైప్‌లైన్‌లు అత్యంత మండే పెట్రోలియం ఉత్పత్తులను తీసుకువెళతాయని, చాలా అధిక పీడనం వద్ద పనిచేస్తాయన్నారు. అనధికారిక క్లాంప్, వాల్వ్ యంత్రాలను అమర్చడం ద్వారా చమురు దొంగతనం, పైప్‌లైన్‌ను ట్యాంపరింగ్ చేయడం వల్ల విలువైన దేశ వనరులు కోల్పోవడమే కాకుండా, పెద్ద అగ్నిప్రమాదం, ప్రాణనష్టం రూపంలో విపత్తును సృష్టిస్తుందన్నారు. నేషనల్ పైప్‌లైన్‌పై చోరబాటు ప్రయత్నం ప్రజా ఆస్తి, పర్యావరణం, పెట్రోలియం అండ్ మినరల్ పైప్‌లైన్స్ (వే హక్కు సేకరణ) చట్టం 1962లోని సెక్షన్లు 15,16 ప్రకారం తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు.పైప్‌లైన్లను దెబ్బతీసే ఏ చర్య అయినా నాన్ బెయిలబుల్ నేరమన్నారు. అంతేకాకుండా చోరబాటుదారులకు పదేళ్ల లేదా అంతకంటే ఎక్కువ కఠిన కారాగార శిక్ష విధించబడుతుందని తెలిపారు. పైప్‌లైన్ అక్రమ చోరబాట్లపై ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లకుండా నిరోధించే చట్టంలోని సెక్షన్ 3, 4, పేలుడు పదార్థాల చట్టంలోని సెక్షన్ 3,4,4, ఐపిసి సెక్షన్లు 34,120బి, 285,379,411,427, 511 సెక్షన్ల కింద శిక్షార్హులవుతారన్నారు.

ఇండియన్ ఆయిల్ సంస్థ అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, నిఘా వ్యవస్థలను మోహరించి పైప్ లైన్ల నునిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు.చోరీ, చోరబాట్ల లొకేషన్ సమాచారాన్ని ఆటోమేటిక్‌గా గుర్తించి పంపుతుందన్నారు. సమాచారం వెంటనే ఇండియన్ ఆయిల్ కంట్రోల్ రూమ్‌కు చేరవేసే డ్రోన్,అదనంగా,' 'స్కాడా సిస్టమ్,''లీక్ డిటెక్షన్ సిస్టమ్''హానికరమైన పాయింట్లను గుర్తించడానికి.24 గంటలూ తనిఖీలు, నిఘా కోసం ఫిజికల్ వాచ్ సిబ్బందిని నియమించారన్నారు పైప్ లైన్ చోరబాటు ఘటనలకు పాల్పడిన వారి వివరాలు తెలియజేసిన వారికి,తగినరివార్డు స్కీమ్‌ను కూడా ఇండియన్ ఆయిల్ అమలు చేసిందని తెలిపారు స్థానిక పోలీసులతో సహ కార్పొరేషన్ ,సెక్యూరిటీ ఏజెన్సీలకు చోరబాటు విషయాన్ని నివేదించినవారికి మంచి నగదు బహుమతి ఉంటుందన్నారు. చోరబాటు కార్యకలాపాల సమాచారాన్ని ఇండియన్ ఆయిల్ టోల్ ఫ్రీ నెంబరు 18004252159, ఫోన్ నంబర్లు 9154355830 (వైజాగ్ కంట్రోల్ రూమ్), ల్యాండ్ లైన్ 08912999889 (వైజాగ్ కంట్రోల్ రూమ్) లేదా ఇమెయిల్ PHPLVIzCR@indianoil.in ద్వారా పంచుకోవచ్చన్నారు.సమాచారమిచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 990 కిలోల పిడిఎఫ్ బియ్యాన్ని కంచరపాలెం పోలీసులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వాహనాల తనిఖీలో భాగంగా కొత్తపాలేనికి చెందిన ఆటో డ్రైవర్ అశోక్ దాదాపు పది క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యంతోపాటు ఆటోను సీజ్ చేశారు.

కుళ్లిన మాంసం విక్రయిస్తున్న కామత్ హోటల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : కుళ్లిన మాంసం విక్రయిస్తున్న బీచ్ రోడ్డులోని లాసెన్స్‌బే కామత్ హోటల్‌పై చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ రాజేటి బసవ కృష్ణమూర్తి మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం కామత్ హోటల్ వద్ద తాను కౌజు కోడి మాంసాన్ని కొనుగోలు చేశానన్నారు. దాన్ని తినడానికి ప్రయత్నిస్తే చెడిపోయిన వాసన రావడంతో వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారి అప్పారావుకు ఫోనులో ఫిర్యాదు చేశానన్నారు. తాను బయట ఉన్నందున రాలేనని, తమ డిపార్ట్‌మెంట్‌లో సిబ్బంది కొరత ఉందని, రేపు ఉదయం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. అర్జెంట్ అయితే మరొక ఫుడ్ సేఫ్టీ అధికారి నందజీకి ఫోన్ చేయండని ఆయన కాంటాక్ట్ నెంబర్ ఇచ్చారన్నారు. ఆయనకు ఫోను చేస్తే, తన పరిధి కాదని,జర్నలిస్టు కనుక వార్త రాసుకోండని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కుళ్లిన మాంసం విక్రయిస్తున్న కామత్ హోటల్‌పైనా, వినియోగదారుడి ఫిర్యాదుపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరాడు.

మృతుని కుటుంబానికి రూ.16 లక్షల పరిహారం

ప్రజాశక్తి -ములగాడ : కోరమండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ సంస్థలో ఆదివారం జరిగిన ఘటనలో మృతుని కుటుంబానికి రూ.16 లక్షల పరిహారం చెల్లించేందుకు ఒప్పందం కుదిరిందని మల్కాపురం సిఐ విద్యాసాగర్ తెలిపారు. ఘటనపై అఖిలపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టగా, కోరమండల్ యాజమాన్యం స్పందించి సంస్థ తరఫున రూ.14.50 లక్షలు, ట్రావెల్స్ యజమాని మరో రూ.1.50లక్షలు మొత్తంగా రూ.16లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. చర్చల్లో సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి కార్మికసంఘాల నేతలు పాల్గొన్నారు.

పలువురు న్యాయమూర్తులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : రాష్ట్రంలోని 13మంది జూనియర్ డివిజన్ సివిల్ జడ్జిలను సీనియర్ డివిజన్‌కు ఉద్యోగోన్నతి కల్పించి, వివిధ న్యాయస్థానాల్లో నియామకాలు చేస్తూ మంగళవారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఖాళీగా ఉన్న విశాఖపట్నం ఒకటవ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, మహిళా కోర్టు న్యాయమూర్తి పోస్టులో గాజువాకలో జూనియర్ సివిల్ జడ్జిగా సేవలు అందిస్తున్న పి ప్రదీపను ప్రమోషన్‌పై నియమించారు. ఖాళీగా ఉన్న చోడవరం సీనియర్ సివిల్ జడ్జిగా అమలాపురంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా సేవలందిస్తున్న వి గౌరీశంకరరావుకు ప్రమోషన్ కల్పిస్తూ నియమించారు. ఖాళీగా ఉన్న అనకాపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్థానంలో భీమునిపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జిగా విధులు నిర్వహిస్తున్న పి.నాగేశ్వరరావు ఉద్యోగోన్నతిపై వస్తున్నారు. విశాఖపట్నం ఎనిమిదవ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న డి సోనీని నగరంలోని ఆరువ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా ప్రమోషన్‌పై నియమించారు. ఇదే స్థానంలో విధులు నిర్వహిస్తున్న ముక్తా వెంకటేశ్వరరావును విశాఖపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. న్యాయమూర్తులు తమకు కేటాయించిన స్థానాల్లో ఈనెల 13వ తేదీలోగా విధుల్లో చేరాలని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒడిశా జయభేరి!

- అసోంపై 63 పరుగుల తేడాతో విజయం
- సయ్యద్ ముస్తాక్ ఆలీ టీ20 క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి -మధురవాడ : సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ఒడిశా జట్టు 63 పరుగుల తేడాతో అసోంపై జయభేరి మోగించింది. మంగళవారం పి.ఎం.పాలెంలోని వైఎస్ఆర్ ఎసిఎ,విడిసిఎం అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఒడిశా బౌలర్లు సమష్టిగా రాణించి, విజయంలో కీలకపాత్ర పోషించారు. టాస్ నెగ్గిన అసోం జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ చేసిన ఒడిశా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 117 పరుగులు చేసింది.అసోం బౌలర్లు అద్భుతమైన బౌలింగ్‌తో ఒడిశా జట్టును కట్టడి చేశారు. ఒడిశా జట్టులో స్వాస్తిక్ సమాల్, సందీప్ పట్నాయక్ మినహా మిగతా వారు రెండంకెల స్కోర్ చేయలేకపోయారు.

సమాల్ 'కమాల్' మ్యాజిక్ ఇన్నింగ్..

ఒడిశా ఓపెనర్ స్వాస్తిక్ సమాల్ సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. ఓ వైపు బ్యాట్స్‌మెన్‌లు పెవిలియన్‌కు క్యూ కడుతున్నా, సమాల్ కమాల్ కేవలం 26 బంతుల్లో 5 భారీ సిక్సర్లు, 7 బౌండరీలతో 69 పరుగులు చేసి రనౌట్ అయ్యాడు. మరో బ్యాట్స్‌మెన్ సందీప్ పట్నాయక్ 8 బంతుల్లో మూడు బౌండరీలు, మూడు సిక్సర్ల సహాయంతో 31 పరుగులు చేశాడు. అసోం బౌలర్లలో రోషన్, అనిల్ చెరో రెండు వికెట్లు, ముఖ్తార్ హుస్సేన్ ఒక వికెట్ తీసుకున్నాడు.

57 పరుగులకే కుప్పకూలి ఓడిన అసోం

118 పరుగుల సాధారణ లక్ష్యంతో బ్యాటింగ్‌కి దిగిన అసోం, ఒడిశా బౌలర్ల ధాటికి కేవలం 8.1 ఓవర్లలో 57 పరుగులకు కుప్పకూలింది. స్వల్ప విజయలక్ష్యాన్ని చేధించలేక బోల్తాపడింది. ఒడిశా బౌలర్లు రాజేష్ మహంతి, ప్రదీప్ ప్రధాన్, జమాల మహపాత్ర, గోవింద్ పొద్దార్‌లు నిప్పులు చెరిగే బౌలింగ్‌తో అసోం బ్యాట్స్‌మెన్‌లను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఈ నలుగురు చెరో రెండు వికెట్లు తీసి అస్సాం పతనాన్ని శాసించారు. అసోం జట్టులో సాహిల్ జైన్ 18 (2 ఫోర్లు, ఒక సిక్సర్), నిపాన్ దేకా12 పరుగులు చేశారు. మిగితా బ్యాట్స్‌మెన్లు రెండంకెల స్కోర్ చేయలేదు. స్వస్తిక్ సమాల్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు.

యాజమాన్యం దిగొచ్చే వరకూ పోరాటం

• స్పష్టం చేసిన విశాఖ డెయిరీ కార్మికులు • 13వ రోజుకు చేరిన రిలే దీక్షలు • సిపిఎం, సిఐటియు నేతల సంఘీభావం

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ యాజమాన్యం దిగొచ్చి, కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగుతుందని, విశాఖ కోఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ స్పష్టం చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో డెయిరీ వద్ద నిర్వహిస్తున్న రిలేదీక్షలు మంగళవారం 13వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు సంఘీభావం తెలిపిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పబ్లిక్‌సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ ఎస్. జ్యోతీశ్వరరావు, సంఘీభావం తెలిపారు.

ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ, కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో విశాఖ డెయిరీ యాజమాన్యం కావాలనే కాలయాపన చేస్తోందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, హక్కులపై ప్రశ్నించే వారిపై వేధింపులు, కక్షసాధింపు చర్యలు మానుకోవాలని,బానిసలుగా చూసే వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై యాజమాన్యం స్పందించకుంటే, సమ్మెకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌వి అప్పారావు, ఎన్ రాజేంద్రప్రసాద్, ఎల్ ఏ ఎం నాయుడు జగదీష్ పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న జ్యోతీశ్వరరావు

కోలాటం బృందానికి చీరలు అందజేత



చీరలు అందజేస్తున్న శివ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఆరవ వార్డు బోరవానిపాలెంలోని కోలాటం బృందానికి స్థానిక వార్డు జనసేన అధ్యక్షుడు శివ రూ.11వేల విలువైన ఏకరూప చీరలను మంగళవారం పంపిణీ చేశారు. జీవీఎంసీ 6వ వార్డ్ పరిధిలోని కోలాటం బదానికి ఆ వార్డ్ జనసేన అధ్యక్షులు దేవర శివ చీరలు అందజేశారు.. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ సాంప్రదాయ కళలు కనుమరుగౌతున్న పరిస్థితుల్లో ఇక్కడి కళాకారులు కోలాటం నేర్చుకోవడం అభినందనీయమని, వారిని ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. బోరవానిపాలెం కోలాటం బృందానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానన్నారు. ఈ సందర్భంగా శివకు కోలాటం బృందం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షులు దారపు సూరిబాబు, చెన్న అయ్యప్ప, ఎర్రయ్య, బత్తిన శివ, ఆదినారాయణ, కె.నారాయణ, సునీల్, లలిత, జీరు అప్పలరెడ్డి, దారపు రెడ్డి, బోయి అప్పలరెడ్డి, కనకరాజు, శ్రీకాంత్, బోర అప్పలరెడ్డి, డ్యాన్స్‌మాస్టర్ సూర్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



పూర్వ విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్‌పి ఉన్నత పాఠశాల 1978 -79 బ్యాచ్ టెన్త్‌క్లాస్ పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో నెలకొల్పిన జాతీయనేతల విగ్రహాలకు పైకప్పుగా వారంతా ఆర్థిక సాయంతో ఓ షెడ్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం పొట్నూ రు మురళీ మోహనరావు స్పందిస్తూ, పూర్వ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో ఈ తరహా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డివి చలపతిరావు, కోశాధికారి గోపాలరావు, గౌరవ సలహా దారులు పి.నాగరాజు, కార్య నిర్వాహక కార్యదర్శులు డి బంగార్రాజు, జిఎస్.సుగుణాకరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముందుగా మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రైతులకు వ్యవసాయ సూచనలు



వరి పొలాలను పరిశీలిస్తున్న ఎఒ సంధ్యారత్నప్రభ

ప్రజాశక్తి-ఆనందపురం: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో బోని, గొట్టిపల్లి గ్రామాల్లోని దెబ్బతిన్న వరి పొలాలను మండల వ్యవసాయాధికారి సిహెచ్ సంధ్య రత్నప్రభ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో మండలంలో52 ఎకరాల్లో వరి చేలు నేలకొరిగాయన్నారు. తుఫాన్ తగ్గడంతో కోసిన వరిపనలపై ధాన్యం మొలకెత్తకుండా వాటిని విడదీసి ఎండబెట్టాలని, లీటరు నీటిలో రెండు గ్రాముల గడ్డఉప్పు కలిసి, రెండు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. పడిపోయిన వరిచేనును ఎత్తి, కట్టలుగా కట్టి నిలబెట్టాలన్నారు.

ఆసుపత్రి కార్మికుల తొలగింపు అన్యాయం

కార్మికశాఖ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన సెవెన్ హిల్స్ కార్మికుల నిరసన



లేబర్ ఆఫీస్ వద్ద ఆందోళన చేస్తున్న సెవెన్ హిల్స్ కార్మికులు

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో 30ఏళ్లకు పైగా పనిచేస్తున్న 38 మందిని కార్మికులను యాజమాన్యం తొలగించడం అన్యాయమని విశాఖ జిల్లా హాస్పిటల్, నర్సింగ్‌హోం కార్మికుల అసోసియేషన్ జిల్లా సెక్రటరీ వై.రాజు అన్నారు. మంగళవారం అక్కయ్యపాలెంలోని కార్మికశాఖ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సెవన్ హిల్స్ ఆసుపత్రిలో కార్మికులను తొలగించడంతోపాటు అక్కడి మహిళా కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే సమ్మెబాట తప్పదని ఇప్పటికే నోటీసులిచ్చామన్నారు. దీనిపై కార్మికశాఖ అధికారికి ఫిర్యాదు చేశామన్నారు. ధర్నాలో కార్మికులు పాల్గొన్నారు.

310 మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు



కంటిపరీక్షలు చేస్తున్న ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి- తగరపువలస : దివీస్ ఆధ్వర్యంలో చిప్పాడలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 310 మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో చిప్పాడ, అన్నవరం, మూలకుద్దు, పెద నాగమయ్య పాలెం, తది తర గ్రామాలకు చెందిన కంటిరోగులు పాల్గొనగా, వారిలో 130 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. 170 మందికి కళ్లద్దాలు, 75 మందికి శుక్లాల శస్త్ర చికిత్సలు అవసరమని నేత్ర వైద్య నిపుణులు నిర్ధారించారు. దృష్టిలోపం ఉన్నవారికి 20 రోజుల్లో కళ్లద్దాలు ఉచితంగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. అంతర కుసుమాలున్న వారికి ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రిలో విడతలవారీగా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని దివీస్ సంస్థ జిఎం ఎంఎస్ఎన్ రావు తెలిపారు. సిఎస్‌ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, హాస్పిటల్ ఆప్తమాలజిస్ట్ నాగలక్ష్మి, శిరీష, అనూష సంతోషి, సిఎస్‌ఆర్ ప్రతినిధులు శ్రీనివాస్,నరసింహా, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



వినతులు స్వీకరిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి- ములగాడ : సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. మంగళవారం జివిఎంసి 60వ వార్డు ఇందిరా కాలనీలో ప్రజాదర్బార్‌లో. వార్డు పరిధిలోని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సామాజిక పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు మంజూరు తదితర వ్యక్తిగత సమస్యలపై దరఖాస్తులు రాగా, అధికారుల సమక్షంలో వాటి పరిష్కారానికి చొరవ చూపారు. కార్యక్రమంలో జివిఎంసి ఐదోజోన్ కమిషనర్ రాము, 60వ వార్డు టిడిపి అధ్యక్షులు మాత శ్రీను, రాష్ట్ర వెలమ కార్పోరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు, నాయకులు బుధ త్రినాధ్, వినయ్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

89వ వార్డు కొత్తపాలెంలో..

గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు కొత్తపాలెంలో ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన అన్నిశాఖల అధికారులతో ప్రజాదర్బార్ నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు ప్రజలు బారులుదీరి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌సి హైమావతి, వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, టిడిపి వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్, నాయకులు గొర్లె నరసింగరావు, కంపర ఆనంద్, గవ్వ భాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఇఒ రాజ్‌కుమార్

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలోని వివిధ నిధులతో చేపట్టి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 -25 ఏడాదికి గాను జల్‌జీవన్ మిషన్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరైన పనుల పురోగతిపై సమీక్షించి, వాటిని వెంటనే చేపట్టి మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు .భీమిలి,పెందుర్తి డిఇఇలకు పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి, పంచాయతీరాజ్ శాఖ ఎఇఇ శ్రీనివాసరావు, మజ్జి వెంకటరావు పాల్గొన్నారు

ఎయు విద్యార్థులకు 'కాగ్నిజెంట్' స్కాలర్‌షిప్‌లు

- ఒక్కో విద్యార్థికి రూ.70 వేలు ఆర్థిక సాయం



విసితో కలిసి ఆర్థిక సాయం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యావిభాగంలో బిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుతున్న విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేసింది. ఒక్కొక్కరికి రూ.70 వేలు చొప్పున పదిమందికి రూ.ఏడు లక్షలను సాయాన్ని అందజేశారు. ఈసందర్భంగా స్కాలర్షిప్ సాధించిన విద్యార్థులను ఎయు విసి ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి స్కాలర్‌షిప్‌లను అందించి, ప్రోత్సాహిస్తున్న కాగ్నిజెంట్ ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ఏటా తమ విభాగంలోని విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ అందిస్తున్న ఆర్థిక సహకారం విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహకంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఎయు ఆలుమ్ని అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్ రాజా, విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ మూర్తి, డాక్టర్ రాము పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి- అచ్యుతాపురం

బేసిక్ పోలీసింగ్, విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించి, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు పట్ల ముఖ్యంగా నిరుపేదలు, వృద్ధులు, మహిళలు సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా సహకరించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, నాటు సారా తయారీపై పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాల కట్టడికి ఆకస్మిక/ డైనమిక్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. తరచూ రిపోర్ట్ అవుతున్న నేరాలు గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి, ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని తగు సూచనలు ఇచ్చారు. రాత్రిపూట నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ గస్తీని ముమ్మరంగా నిర్వహించాలన్నారు. అనుమానా స్పదంగా సంచరిస్తున్న వారిని ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం ద్వారా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రౌడీ షీటర్స్, చెడునడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని, ప్రస్తుతం వారు జీవనోపాధికి ఏమేమి పనులు చేస్తున్నారో ఆరా తీయాలని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. సైబర్ నేరాలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు గురించి ప్రజలకు తెలియజేసి, సైబర్ నేరాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, సమస్యలు గూర్చి ఆరా తీశారు. జిఎంఎస్‌కేలు అనుసంధానంతో సమస్యాత్మక ప్రాంతాలు, వార్డులలో తరచూ సందర్శించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అచ్యుతాపురం నాలుగు రోడ్ల జంక్షన్‌ను జిల్లా ఎస్పీ పరిశీలించి అక్కడ ఉన్న ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ట్రైనీ ఐపిఎస్ అధికారి మనీష్ రెడ్డి, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కెవి.సత్యనారాయణ, అచ్యుతాపురం సిఐ నమ్మి గణేష్, ఎస్సైలు జి.సుధాకర్, ఎం.వెంకటరావు, సిబ్బంది ఉన్నారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా



మాట్లాడుతున్న సిఐటియు నేత శ్రీనివాసరావు

ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కశింకోట : ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలో తాళ్లపాలెం పిహెచ్‌సి వద్ద కశింకోట మండల ఆశ వర్కర్ల యూనియన్ (సిఐటియు) సమావేశం మంగళవారం జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వమైనా సరే అమలు చేయాలన్నారు. ఆశా కార్యకర్తలకు ఇతర పనులు అప్పజెప్పకుండా వారి విధులను వారు సక్రమంగా నిర్వర్తించే విధంగా ప్రభుత్వం జాబ్ చార్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అర్హతలు కలిగిన ఆశా కార్యకర్తలకి పదోన్నతులు కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పద్మ, కుమారి, రమణమ్మ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పేరెంట్స్ మీటింగ్‌కు ఆహ్వాన పత్రిక తయారు చేసిన విద్యార్థులు

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని జుత్తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7తేదీన జరుగు మెగా పేరెంట్స్ మీటింగ్ కొరకు ఆ పాఠశాల విద్యార్థులు స్వయంగా ఆహ్వాన పత్రిక తయారు చేశారు. దీనిని పాఠశాల హెచ్ఎం వివి.శేషగిరి రావు తదితరులు పరిశీలించారు. సమావేశానికి పిల్లలు అందరూ తల్లిదండ్రులను తీసుకురావాలని ఆయన కోరారు. ప్రభుత్వం సంకల్పించిన ఈ కార్యక్రమానికి అందరి సహాయ సహకారాలు అవసరమని ఆయన కోరారు.

ఎంఇఒ-2గా రవీంద్రబాబు బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-సబ్బవరం : మండల విద్యాశాఖాధికారి-2గా ఎం.జె.రవీంద్రబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రవీంద్రబాబు బుచ్చెయ్యపేట మండలం తురకలపూడి జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పని చేసి పదోన్నతిపై ఎంఈఓ-2గా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఎమ్మెల్యే దృష్టికి దేవరాపల్లి సమస్యలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని దేవరాపల్లి తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ కార్యవర్గ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు గొర్లి దేముళ్ళు ఆధ్వర్యాన మంగళవారం కలిసి గ్రామంలో సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యలను పరిశీలన చేసి త్వరలో త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ద్మ్ణఖ సత్తిబాబు మాస్టారు, పార్టీ యువ నాయకుడు శంకర్, కాటపల్లి సన్యాసిరావు, సిహెచ్ బాబ్జి, కోరుపోలు చంద్రావు, గొర్లి కన్నబాబు, గొర్రె సన్నిబాబు, గొర్లి అర్జున, గొర్లి దేముళ్ళు, గొర్లి సన్యాసినాయుడు, గొర్లి పాత్రుడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బండారుకు వినతిపత్రం ఇస్తున్న దేవరాపల్లి టిడిపి నేతలు

'డోలీలో ఆసుపత్రికి గర్భిణి తరలింపు' వార్తకు స్పందన

బోడిగరువు గ్రామాన్ని సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలం చింతలపూడి పంచాయతీ శివారు బోడిగరువు గ్రామానికి చెందిన గర్భిణిని డోలీ మోతతో ఆసుపత్రికి తరలింపుపై మంగళవారం ప్రజాశక్తిలో 'డోలీలో ఆసుపత్రికి గర్భిణి తరలింపు' శీర్షిక వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. మండల ప్రత్యేక అధికారి మంజులా వాణి, ఎంపీడీవో సువర్ణ రాజు, ట్రైబుల్ వెల్ఫేర్ ఆఫీసర్ శిరీష మంగళవారం సాయంత్రం బొడి గరువు గ్రామాన్ని సందర్శించారు. రోడ్డు సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో కలిసి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. గిరిజనులు చెప్పిన సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు యశ్వంత్ ఎంపిక

ప్రజాశక్తి - బుచ్చయ్య పేట


మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న గొంప యశ్వంత్ జాతీయస్థాయి అండర్-17 రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.సత్యరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్ కుమార్ మంగళవారం తెలిపారు. నవంబర్ 28 29 తేదీల్లో గుంటూరు జిల్లా వెనిగండ్లలో జరిగిన పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుండి అత్యంత ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థి యశ్వంత్‌ను గ్రామ పెద్దలు అభినందించారు. 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాల నుండి కబడ్డీ, రగ్బీ, సాఫ్ట్బాల్, ఫుట్బాల్, ఫెన్సింగ్ కోకో తదితర పోటీల్లో 21 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వారు తెలిపారు



యశ్వంత్‌ను అభినందిస్తున్న టీచర్లు

వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం పాపయ్య సంతపాలెం గ్రామానికి చెందిన షేక్ ఫైదామాకు వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. ఫైదామా గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య చేసుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో శాసన సభ్యులు కొణతాల రామకృష్ణను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కొణతాల సీఎం సహాయనిధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ద్వారా లక్ష 90 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరు చేయించారు. ఈ ఆర్థిక సాయాన్ని మంగళవారం జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గం ఇన్చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) చేతుల మీదుగా ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి మండలం జనసేన నాయకులు, తుమ్మపాల ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, అనకాపల్లి మండలం జనసేన నాయకులు బంటు రవి, అప్పలనాయుడు పాల్గొన్నారు.



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న జనసేన నేత రాంకీ

ఉపాధి హామీ ద్వారా పశుగ్రాసం సాగుకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-కె.కోటపాడు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా పశుగ్రాసం సాగు చేసుకోవడానికి ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని పశువర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఈ.దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక పశువర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం దేవరాపల్లి. కే కోటపాడు మండలాలకు చెందిన పశు వైద్య సహాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జాబ్ కార్డు కలిగి ఉండి ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జాబ్ కార్డు, ఆధార్ కార్డు భూమికి సంబంధించిన వన్‌బి మొదలగు జెరాక్స్ కాపీలను ఉపాధి హామీ సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. అఖిలభారతం పశువు గణన వచ్చే ఏడాది ఫిబ్రవరి చివరనాటికి పూర్తిచేయాలని ఆయన పశు వైద్య సహాయకులను కోరారు. ఇప్పటికే 25శాతం గణన పూర్తయిందని మిగిలిన 75శాతం గడువులోగా పూర్తి చేయాలన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులో భాగంగా పశు యాజమాన్యం కింద కావలసిన రైతులకు రుణ సదుపాయం కల్పించబడుతుందని, కావలసినవారు సహాయకులను సంప్రదించాలని కోరారు. ఈ రుణం తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీతో సహా చెల్లించినట్లయితే బాకీ తీరిన పిదప వడ్డీని సదరు రైతుకు తిరిగి ఇవ్వబడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కే కోటపాడు, దేవరపల్లి మండలాలకు చెందిన 24 మంది పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ ఏడి దినేష్‌కుమార్

అక్రమ చేపల పెంపకందారులపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలో వ్యర్థాలతో అక్రమంగా చేపల పెంపకం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లి మండలం తారువ గ్రామంలో బోలే వెంకటేష్ అనే వ్యక్తి బలోరా వ్యాన్‌తో వ్యర్థాలను మంగళవారం తరలిస్తుండగా, సిపిఎం నేత వెంకన్న పట్టుకొని మత్స్యశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ మండలంలోని కొత్తపెంట, ములకలాపల్లి, మామిడిపల్లి, కలిగొట్ల, మారేపల్లి, చేనులపాలెం, దేవరాపల్లి, పెదనందిపల్లి, తారువ, గజపతినగరం తదితర గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా దాదాపు 1500 ఎకరాల్లో అక్రమంగా చేపల చెరువులు తవ్వి చేపల వ్యాపారం జరుగుతుందని తెలిపారు. ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారులు భూములను లీజుకు తీసుకొని చెరువులు తవ్వి రైవాడ జలాశయం నీటితో చేపలు పెంపకం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ చెరువుల్లో చేపల పెంపకం కోరకు మేతగా చనిపోయిన పశుమాంసం, కోడి, గొర్రె, మేకల మాంసం వ్యర్థాలను, బ్రాండిక్స్‌ల లాంటి కంపెనీల క్యాంటీన్‌ల వ్యర్థాలను తీసుకొచ్చి వేస్తున్నారని తెలిపారు. ఈ చేపలు తినేవారికి తీవ్రమైన రోగాలు, కేన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువుల పక్కనే ఉన్న పశువుల పాకలు, కళ్లాలు, పొలాల్లోకి వృథా నీటిని వదులుతున్నారని, దీని వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రైతులకు అందాల్సిన రైవాడ రిజర్వాయర్ నీటిని చేపలు చెరువులకు వాడుకుంటూ రైతుల పొలాలకు నీరు లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. వీటిపై అధికారులు నోటీసులు ఇచ్చిన, బైండవర్ కేసులు పెట్టిన వారి అక్రమ పద్ధతులు ఆగడం లేదన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని అక్రమంగా వ్యర్థ పదార్థాలతో చేపలు పెంపకం చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వెంకన్న డిమాండ్ చేశారు.


చేపల మేతకు తీసుకెళ్తున్న వ్యర్థాలను అడ్డుకొని పరిశీలిస్తున్న వెంకన్న


బాల వివాహాల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాల్య వివాహాలు భవిష్యత్తుకు సమాధి

ప్రజాశక్తి-వడ్డాది

బాల్య వివాహాల వల్ల పిల్లల భవిష్యత్తుకు సమాధి వేసినట్లేనని జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి లోవరాజు అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది కెపిడి జెడ్పి హైస్కూల్లో బాల్యవివాహాలు -పిల్లల దత్తత గురించి విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు మగవారికి 21 సంవత్సరాలలోపు పెళ్లి చేయటం చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహాలు చేసుకుంటే భవిష్యత్తు అంధకారమన్నారు. అలాగే అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. చట్టబద్ధమైన దత్తత ఆనందదాయకమని, చట్టానికి విరుద్ధంగా దత్తత పొందితే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. పిల్లల్ని దత్తత తీసుకునే సమయంలో సిఏఆర్ఈ అనే పోర్టల్ ద్వారా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా అప్లై చేసుకోవాలన్నారు. అనంతరం గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శేషుబాబు, వెంకటేశ్వర్లు, అంగన్వాడీలు బి.మణి, వెంకట్ లక్ష్మి ఎంఎస్‌కె ఉమ, ఏఎన్ఎం కనక లక్ష్మి, శశికళ, ఆశ సుశీల, లక్ష్మి, కామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలపై ఆసక్తి చూపాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రభుత్వం అందించే రాయితీలు ప్రతి రైతు వినియోగించుకొని వాణిజ్య పంటలపై ఆసక్తి చూపించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని వారాడ గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన విత్తన పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. వరి, చెరకు పంటల సాగును తగ్గించి ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నందున ప్రతి రైతు సేంద్రీయ విధానాన్ని అమలు చేయాలన్నారు. వాణిజ్య పంటల సాగు ద్వారా అధిక రాబడి పొందవచ్చని చెప్పారు. కూరగాయలు, పండ్లు నిల్వ చేసుకునేందుకు వీలుగా కే సంతపాలెంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విశాఖ నగరం ఆరిలోవ సుజాతనగర్‌లో కొత్తగా రైతుబజారు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశం అనంతరం రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి రవీంద్రనాథ్, వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు సోమశేఖర్, కిరణ్మయి తెలుగుదేశం నాయకులు రొంగళి మహేష్, సబ్బవరపు రామానాయుడు, లెక్కల అవతారం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపిపి నాగిరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని అడ్డూరు గ్రామంలో మంగళవారం మాజీ ఎంపీపీ నాగిరెడ్డి వెంకటరమణ (నాయుడుబాబు) నాలుగవ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయుడు బాబు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నాయుడు బాబు కుటుంబ సభ్యులు సమకూర్చిన యూనిఫారం స్థానిక పాఠశాల విద్యార్థులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కెఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లు నాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు బి నాగ గంగాధర్, మాజీ జెడ్పిటిసి కనిశెట్టి సన్యాసిరావు, మాజీ ఎంపిపి జి వెంకట సత్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు యూనిఫారం అందజేస్తున్న అయ్యన్నపాత్రుడు

స్కిల్ హబ్స్ ద్వారా ఉచిత శిక్షణ, ఉపాధి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న స్కిల్ హబ్స్ ద్వారా వివిధ కోర్సులో మూడు నెలలు పాటు నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికేట్‌తో పాటూ ఉపాధి కల్పించబడుతోందని ఉమ్మడి జిల్లా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీయువకులు ఈ క్రింద ఇచ్చిన స్కిల్ హబ్ వివరాలు ఆధారంగా నైపుణ్యం, అప్.గొవ్.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకి కింది ఇచ్చిన ఫోన్ నెంబర్లో సంప్రదించాలని కోరారు.

గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ ఫర్ ఉమెన్, భీమిలీ
అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ : 9553558191,
గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ, విశాఖపట్నం
డ్రోన్ మ్యానుఫ్యాక్చరింగ్ అసెంబ్లీ టెక్నీషియన్ : 7287069457
గవర్నమెంట్ ఐ.టి.ఐ (పాత), విశాఖపట్నం
లైన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ టెక్నీషియన్ : 8555868681,
గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి
అసిస్టెంట్ మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్/ షీల్డ్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ వెల్డర్ : 9014766143,
గవర్నమెంట్ ఐ.టి.ఐ, గాజువాక
టెక్నికల్ ఎలక్ట్రీషియన్ -8121743777,
విశాఖ ఉమెన్స్ డిగ్రీ కాలేజీ, విశాఖపట్నం సౌత్
కోర్సు ఆన్ కంప్యూటర్ కాన్సెప్ట్ 9121676360,
డాక్టర్ వివిఎస్ కృష్ణ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, విశాఖపట్నం ఈస్ట్
ఆఫీస్ అసిస్టెంట్ - 9885694676,
ఎన్ఎసి శిక్షణా కేంద్రం, గాజువాక
అసిస్టెంట్ ప్లంబర్ జనరల్- 9493837994,
ఎన్ఎసి శిక్షణ కేంద్రం, విశాఖపట్నం
అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్: 9676170026 సెంటర్లను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

మండలంలోని ఆర్.భీమవరం గ్రామంలో విద్యుత్ అధికారులు మాయాజాలాన్ని ప్రదర్శించారు. బుచ్చెయ్యపేట మండలం రాజాం సబ్ స్టేషన్ పరిధిలో 24 గంటలు కరెంటు మొదటిగా ఆర్.భీమవరంలో ఏర్పాటు చేసేందుకు స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేశారు. 63 కేబుల్ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటుకు సిమెంట్ దిమ్మ సైతం నిర్మించి అన్ని ఏర్పాట్లు చేశారు. అన్ని ఏర్పాట్లు చేసినట్టు చేసి స్తంభాలను కూడా తొలగించి ట్రాన్స్ ఫార్మర్‌ను అర్ధరాత్రి సమయంలో తరలించుకుపోయారు. ప్రజలు 24 గంటలు కరెంటు కోసం ఎదురుచూస్తున్న సమయంలో విద్యుత్ అధికారు ట్రాన్స్ ఫార్మర్‌ను తరలించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసి 24 గంటలు కరెంటు వచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని గ్రామ సర్పంచ్ అమ్మునాయుడు, మాజీ సర్పంచ్ మలిరెడ్డి బుజ్జి, గ్రామస్తులు, స్థానిక నాయకులు కోరుతున్నారు. తమకు ఎటువంటి సమాచారం లేకుండా విద్యుత్ అధికారులు ట్రాన్స్ ఫార్మర్ ను తరలించుకు పోవడం ఎంత వరకు సమంజసమని వారు విద్యుత్ శాఖా అధికారుల తీరుపై మండిపడ్డారు.


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం నిర్మించిన సిమెంట్ దిమ్మ

రైతుల ఆందోళనలను అడ్డుకోవడం సరికాదు

ప్రజాశక్తి-చోడవరం : విశాఖ డెయిరీ వద్ద సోమవారం రైతులు చేపట్టిన ఆందోళనను పోలీసులు చేత అడ్డగించడం దుర్మార్గమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ డెయిరీని దోచుకునే విధానంగా అధికార ప్రతిపక్ష పార్టీలు తీరు ఉందన్నారు. తూతూ మంత్రంగా కమిటీలు వేసి పాడి పరిశ్రమను పూర్తిగా నష్టాలు బాటలో పెట్టాలని ఆలోచనతో ప్రభుత్వాలు ఉన్నాయని ఆరోపించారు. పాల సేకరణ ధర పెంచాలని సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తే పోలీసులు చేత అణిచివేయడం దారుణమన్నారు. పోలీసులు చేత నోరు నొక్కే ప్రయత్నం చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించిన విషయాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం గమనంలో పెట్టుకోవాలని హితవుపలికారు. విశాఖ డెయిరీపై డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి ఆవు పాలుకు లీటరుకు 50 రూపాయలు, గేదె పాలుకు 80 రూపాయలు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాలాబు పంచాయితీ శివారు చెప్పగరువు, బుచ్చంపాలెం గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి ఆ పంచాయతీ సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రెండు గ్రామాలకు మంచినీటి సదుపాయం లేక గెడ్డ నీరు తాగుతున్నారని తెలిపారు. ఈ విషయం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకెళ్లగా, జల్ జీవన్ మిషన్ కింద రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. రెండు గ్రామాల్లో 20 వేల లీటర్ల తాగునీటి ట్యాంకులు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకి గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోడెల బుజ్జి, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ చంద్రశేఖర్, పంచాయతీ వార్డు సభ్యులు సిహెచ్ వరహాల నాయుడు, టి శ్రీరామ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణం జరిగేనా..?

(మొదటి పేజీ తరువాయి..) ప్రాణ నష్టం జరిగి ఉండేది అనడంలో సందేహం లేదు.

వియంఆర్‌డిఎ తలమునకలు

వియంఆర్‌డిఏ అధికారులు మాత్రం సముద్ర తీరంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి ఉండాలనే నిర్ణయంలో ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. దీనిని అంతగా అలలు తాకిడి లేని, సముద్రం లోతులేని ప్రదేశంగా వారు భావిస్తున్న రుషికొండ వద్ద ఏర్పాటు చేయాలని భావించి ప్రస్తుతం సన్నాహాలు చేస్తున్నారు. మరి అక్కడ నిపుణులతో పూర్తిస్థాయిలో సర్వే చేయించారా ? లేదా ? అనేది తెలియలేదు. నిజానికి విశాఖ పర్యాటక రంగానికి అధిక ఆదాయం రుషికొండ బీచ్ ద్వారానే వస్తోంది. దాదాపు 25 శాతం ఆదాయం రుషికొండ పర్యాటక ప్రాంతం నుంచి వస్తున్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించే పనిలో అధికారులు నిమగ్నంకావడం, ఒక నిశ్చిత అభిప్రాయానికి వచ్చినట్టుగా భావించవచ్చు. ఎందుకంటే ఆర్‌కె బీచ్ వద్ద నిర్మించిన ఫ్లోటింగ్ బ్రిడ్జికి సంబంధించిన పరికరాలను కొంతకాలం జాగ్రత్త చేసి, అక్కడికి ఎవరిని రాకుండా చూసిన పరిస్థితి ఉంది. కొద్దిరోజుల క్రితం ఈ పరికరాలు అన్నింటినీ ఆర్‌కె బీచ్ నుంచి రుషికొండ ప్రాంతానికి, అందునా ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదిస్తున్న స్థలానికి తరలించారు. మరి అక్కడ ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు జరుగుతుంది..? అది ఎప్పుడు పర్యాటకులకు అందుబాటులోకి వస్తుంది..? అన్నది తెలియాల్సి ఉంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విశాఖను మరింత పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని పలు ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తోంది. అందుకోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేయాలని ఈసరికే నిర్ణయించింది. అందులో రుషికొండ ఫ్లోటింగ్ బ్రిడ్జి ప్రాజెక్టు ఒకటి. నిజానికి కేరళ రాష్ట్రంలో అక్కడ వామపక్ష ప్రభుత్వం ఆధ్వర్యంలో కొన్ని సముద్ర తీర ప్రాంతాలలో రెండు నుంచి మూడు ఫ్లోటింగ్ బ్రిడ్జిలను నిర్మించి, కొన్నాళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తూ అక్కడి పర్యాటక రంగానికి ప్రోత్సాహం అందిస్తున్నారు. కనీసం అక్కడి అనుభవాలను, స్వయంగా తెలుసుకోవడం, పరిశీలించడం ద్వారా అటువంటి ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణం సుందర విశాఖ నగరంలో నిర్మించవలసిన అవసరం కూడా ఉందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



నక్కపల్లిలో వికలాంగ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అనకాపల్లి:అనకాపల్లి భవిత కేంద్రంలో మంగళవారం జరిగిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు, ఎంఇఒ ఎస్.కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ఇచ్చే అలవెన్స్‌లను ఈ వారంలో విడుదల చేస్తామని చెప్పారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కొప్పాక జెడ్‌పి హైస్కూల్ ఇన్చార్జి హెచ్‌ఎం ప్రసాద్, సీసీ వెంకటేశ్వరావు, మండల స్పెషల్ ఎడ్యుకేటర్ బీవీ వరప్రసాద్, భవిత ఉపాధ్యాయులు రత్నం, రమాదేవి, సిఆర్ఎంటి శంకర్రావు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఇఒలు సాయి శైలజ, దివాకర్ హాజరై మాట్లాడారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పరవాడ బాలుర హైస్కూల్ హెచ్‌ఎం అప్పలనాయుడు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, స్పెషల్ ఎడ్యుకేటర్ ఎస్ఎస్ఎస్ కుమారి, భవిత కేంద్ర ఫిజియోథెరపిస్ట్ కిరణ్ కుమార్, ప్రత్యేక ఉపాధ్యాయులు జి. శ్రీనివాస్, టి.కుమారి పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఇఒలు ఎస్.లక్ష్మణరావు, ఎంజె .రవీంద్ర బాబు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టి బి.సింహాద్రప్పుడు, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎల్.పద్మ, ఎస్.బేబీరాణి, బి.సింహాద్రి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరి పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట భవిత కేంద్రంలో వికలాంగులు దినోత్సవంలో ఎంపిడిఓ రవికుమార్, ఏంఇఓలు వెంకటసురేష్, సూర్య నారాయణ మూర్తి పాల్గొని మాట్లాడారు. కూటమి నాయకులు డి. పరమేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీను, కాండ్రేగులు సతీష్, తాకాసి కృష్ణ పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో ఆంజనేయులుకు అందజేశారు. చోడవరం సీఐ అప్పలరాజు, ఈవోపీఆర్డి మహేష్, వికలాంగు సంఘం వ్యవస్థాపకులు డిఎస్ ప్రసాద్, నరసయ్యపేట సర్పంచ్ ముమ్మిన నాగబాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక భవిత కేంద్రంలో వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఇఒ కే సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. చౌడువాడకు చెందిన పెంటకోట గణపతిరావు దంపతులు ఆర్థిక సహకారంతో వికలాంగ బాలలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ-2 డివిడి.ప్రసాద్, హైస్కూల్ హెచ్‌ఎం పద్మావతి, ఏ కోడూరు, గొండు పాలెం హెచ్‌ఎంలు ఆర్ రమేష్, ఏ కుమార్, భవిత కేంద్రం నిర్వాహకులు సిహెచ్ కన్నమ్మ పరదేశి పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక భవిత కేంద్రంలో భవిత ఉపాధ్యాయులు సుమతి, విజయేశ్వరుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఎంఈఓలు వేణుగోపాలరావు, శివ నాయుడు దివ్యాంగ పిల్లలకు బహుమతులను అందజేశారు. టెక్కలి వాస్తవ్యులు ఇళ్లపు కష్ణ చైతన్య, వెంకటరావు, శిరీష విద్యార్థులకు బహుమతులను సమకూర్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎంపీటీసీ గణేష్, ఉపాధ్యాయులు రమణమ్మ, కుమారి, సిఆర్పి కర్రీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నక్కపల్లి:విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లోనూ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈఓలు నరేష్, వేమగిరి నూకరాజు సూచించారు. మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి అప్పారావు, ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓలు నరేష్, నూకరాజు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్వెటర్లు, జ్ఞాపికలు అందజేశారు. దాతలు విజయ్ కుమార్ విజేతలకు స్వెటర్లు, కుసుమలత జ్ఞాపికలను సమకూర్చారు. ఈ మేరకు దాతలకు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

కోటవురట్ల:మండలలో భవిత కేంద్ర వద్ద దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామారావు మాట్లాడుతూ, దివ్యాంగుల పట్ల చులకన భావం తగదని, ప్రతి ఒక్కరు వారిని ప్రోత్సహించాలని కోరారు.ఆటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, విద్యార్థులకు అందజేస్తున్న ప్రోత్సాహకాలపై సిబ్బంది సక్రమంగా సమాచారం ఇవ్వలేదని అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, కోఆర్డినేటర్ రమణి, ముఖేష్, శిరీష పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

గొలుగొండ:అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గొలుగొండ మండల భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు మండల బిజెపి అధ్యక్షుడు చందక గౌరినాయుడు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఎర్రం నాయుడు, కో కన్వీనర్ వెలగ జగన్నాథం, గొలుగొండ మండల ప్రధాన కార్యదర్శి రమణ యాదవ్, గొలుగొండ మండల సోషల్ మీడియా కన్వీనర్ చిక్కిరెడ్డి రామదాసు, మండల ఎంఈఓ-1 ఒ.సత్యనారాయణ, ఎంఈఓ-2 ఏవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్:డాబా గార్డెన్స్ డ్వాక్రా బజార్ వద్ద ది ఎబిలిటీ పీపుల్స్ స్వచ్ఛత సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా 22 మంది పిల్లలకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులకు సేవ చేస్తున్న ఈ సంస్థకు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు.ది ఎబిలిటీ పీపుల్స్ సంస్థ డైరెక్టర్ దిలీప్ మాట్లాడుతూ, జీరో నుంచి ఎనిమిది సంవత్సరాల పిల్లలకు వికలాంగులకు వైద్య సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.



భీమిలిలో పిల్లలతో సిఇఒ

ములగాడ : ఎన్నో కష్టాలను అధిగమిస్తూ జీవితంలో విజయాలను సాధిస్తున్న వికలాంగులు, సమాజంలోని ప్రజలందరికీ స్ఫూర్తి ప్రదాతలని పశ్చిమ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లో విఘ్నేశ్వర వెంకట సాయి వికలాంగుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంలో పాల్గొని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వికలాంగులకు నిత్యవసరాలు, రైల్వే, బస్‌పాస్‌లు,సదరం కార్డులను అందజేశారు. .. అనంతరం సింగంపల్లి శ్రీనివాసరావును ఎమ్మెల్యే గణబాబు, భాగ్యలక్ష్మి సత్కరించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సంఘం అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాసరావు, ధర్మేంద్ర, శివకుమార్, కుమార్, రమణ, రాము, జోగిబాబు, ధర్మేంద్ర, శివకుమార్ పాల్గొన్నారు

ఆనందపురం :స్థానిక భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఇఒ గంగరాజు, వికలాంగుల సంఘం మండల అధ్యక్షులు కోరాడ అప్పలస్వామినాయుడు పాల్గొని వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చందక సూరిబాబు, ఎంపిటిసి కొట్యాడ రమాదేవి, డైరెక్టర్ రెడ్డి బాబు, జెడిహెచ్ఎస్ హెచ్‌ఎం రామకృష్ణ పట్నాయక్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.అంజనీకుమారి, సహిత విద్య ఉపాధ్యాయులు బి.ముత్యాలనాయుడు, కలమట శ్రీనివాసరావు, ఐ నాగమణి, అంగన్వాడ టీచర్ కాసులమ్మ పాల్గొన్నారు..

భీమునిపట్నం : స్థానిక భవిత కేంద్రంలోని కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి, డైట్ వైస్‌ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్, ఎంపిడిఒ ఎన్.హనుమంతరావు, ఎంఇఒలు ఎం.శివరాణి, జయప్రద పాల్గొన్నారు. వికలాంగుల దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, హెచ్‌ఎం జి.పైడిరాజు, వెంకటరమణ, ఐఇఆర్‌టిలు కిజియా కుమారి, పార్వతి పాల్గొన్నారు.

మాధవధార : 50, 51వార్డుల్లో వికలాంగులకు మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆర్థికసాయంతో ఇంటింటికీ వెళ్లి నిత్యావసరాలను అందజేశారు.సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు నంబాల ఈశ్వరరావు, తమ్మినేని వెంకటేష్, ఉపాధ్యక్షులు సనపల వెంకటరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సనపల వెంకటరావు సహాయ కోశాధికారి కూన వాసు, సంస్థ వ్యవస్థాపకులు సనపల శ్రీకాంత్,కమిటీ సభ్యులు కొప్పల శ్రావణ్, పేడాడ సూర్య, మూర్తి పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు లక్ష్మీనగర్ ఎంపిపి స్కూల్‌లో వికలాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే గణబాబు బహుమతులు అందజేశారు. జెడ్‌సి హైమావతి, టిడిపి వార్డు అధ్యక్షుడు నారిపిన్ని సత్తిరాజు, హెచ్‌ఎం మోహనరావు, టిడిపి నేతలుఅనూష, ధనలక్ష్మి పాల్గొన్నారు.

శిక్షణకు వెళ్లిన రైతులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:నూతన వంగడాల ఉత్పత్తి శిక్షణకు ఇందిరాగాంధీ కృషి విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రాయ్పూర్, ఛత్తీష్‌గఢ్ రాష్ట్రాల్లో శిక్షణకు జిల్లా వనరుల కేంద్రం పాడేరు, ఏటీఎంఏ విశాఖపట్నం సౌజన్యంతో ముంచింగిపుట్టు, పెదబయలు మండలాల నుండి 17 మంది రైతులను వెళ్లినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యాన వన, చిరుధాన్యాల నాణ్యత, వంగడాల ఉత్పత్తులపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి -నక్కపల్లి :రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని అమరావతిలో మంగళవారం హెూం మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. పాయకరావుపేట నియోజక వర్గంలో అత్యధికంగా రోడ్లు నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినందుకు గాను మంత్రికి కృతజ్ఞతలు తెలిపినట్లు వెంకటేష్ తెలిపారు. అదే విధంగా మరిన్ని రోడ్లు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని మంత్రి జనార్దన్ రెడ్డిని కోరామన్నారు.



మంత్రులతో నాయకులు వెంకటేష్



మాట్లాడుతున్న ఎస్ఐ తారకేశ్వరరావు

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురం అల్లూరి సీతారామరాజు వర్తక సంఘం ఆద్వర్యంలో వన భోజన కార్యక్రమం మంగళవారం గాదిగుమ్మి జలపాతం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కెడీపేట ఎస్సై వై.తారకేశ్వరరావు హాజరై సైబర్ నేరాలపై ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై కరపత్రాలను వర్తక సంఘం నాయకులకు అందించి షాపుల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనాలు జరగకుండా షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లాలం నానిబాబు, జోగునాథం, చక్రీ, జోగుబాబు, వూడా రామచంద్రరావు, బ్రహ్మాజీ, రిటైర్డు హెచ్‌ఎం చింతల అచ్చిరాజులు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

గిరిజనులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో అవురువాడ పంచాయతీ చిన్నసారాడ గ్రామంలో కిడ్నీ సమస్యలతో గిరిజనులు బాధ పడుతుండటంపై మండల అభివృద్ధి అధికారి కొంకి అప్పారావు దృష్టికి పలువురు తీసుకుని వెళ్లగా మంగళవారం కింతలి ప్రభుత్వ వైద్యాధికారులతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. తాగునీటిలో ఎటువంటి ఇబ్బందులు లేవని, క్వారీల వ్యర్థాలతో అనారోగ్యానికి గురవుతున్న గిరిజనులు ఎక్కువ శాతం డైక్లోఫిన్ టాబ్లెట్లు ఎక్కువ వాడటంతో ఈ కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయని సిబ్బంది తెలిపారు. ఆర్.ఎం.పి డాక్టర్లు ఇచ్చిన మందులు ఇష్టానుసారంగా వాడటంతో కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు గిరిజనులకు తెలిపారు. గతంలో కిడ్నీ వ్యాధితో మరణించిన బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని గిరిజనులు అధికారులకు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిముడు మోద హైందవి గుప్తేశ్వరి, ఎంపీటీసీ చదల కృష్ణందొర, కిముడు త్రిమూర్తులదొర, మాజీ ఎంపీటీసి సిహెచ్. కళ్యాణ్ చక్రవర్తి, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంజనీర్

తాగునీటి ట్యాంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కవగుంట గ్రామానికి గత ప్రభుత్వం జల జీవన మిషన్ పథకం కింద రూ.41 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందని సర్పంచ్ దాసరి సూర్యకుమారి తెలిపారు.ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే తమ లక్ష్యమన్నారు. .గ్రామంలో మంగళవారం ఆర్డబ్ల్యూఎస్ సైట్ ఇంజనీరు కే.సుజాత, కాంట్రాక్టర్‌తో కలిసి ట్యాంకు నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ; ఒక్కటే ట్యాంకు కావడంతో నీరు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించలేని పరిస్థితిలో ఈ కొత్త ట్యాంకు మంజూరు కావడంతో తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ అప్పారావు, ప్రగడ శ్రీను, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.78 కోట్లు మంజూరు

- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-గొలుగొండ:తాము అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలంలో నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.78.67 కోట్లు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మంగళవారం గొలుగొండ మండలం పిఎన్‌డి.పాలెం నుండి పప్పుశెట్టిపాలెం వరకు 4కోట్ల 60లతో చేపట్టే తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్టీలతో సంబంధం లేకుండా అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కేంద్రం రూపాయికి ఇస్తున్న బియ్యం లబ్ధిదారులు బ్రోకర్లకు విక్రయించడం సరికాదన్నారు. ఈ సమస్యను కాకినాడలో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అర్హులైన వారికి సంక్రాంతి నాటికి రేషన్ కార్డులు అందజేయడం జరుగు తుందన్నారు. వెంటనే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రానున్న ఐదేళ్లలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మొదట సంవత్సరం రోడ్లకు, రెండో సంవత్సరంలో చెరువులు, కాలువల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని చెప్పారు. పాఠశాల భవనాలు, తాగునీటి ప్రాజెక్టు తదుపరి సంవత్సరాల్లో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవో వి.వి.రమణ, జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర, మండల పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, జెడ్పిటిసి సుర్ల వెంకట గిరిబాబు, పప్పుశెట్టిపాలెం సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, సీనియర్ నాయకులు బెల్లపు కొండలరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల అధికారులు మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న అయ్యన్న



స్మగ్లర్లను అరెస్టు చేసిన పోలీసులు

గంజాయి స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి -నక్కపల్లి:ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈనెల 1వ తేదీన వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా 20 కేజీలు గంజాయిని వదిలేసి ఇద్దరు స్మగ్లర్లు పరారైనట్లు తెలిపారు. స్మగ్లర్ల కోసం గాలించగా సమాచారం మేరకు మంగళవారం ఎస్ రాయవరం, అడ్డ రోడ్డు జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. స్మగ్లర్లుచింతపల్లి మండలం అన్నవరం పంచాయతీకి చెందిన తాంబెలి ఆమోజు, కంఠ నర్సింగ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ కుమారస్వామి వెల్లడించారు.

ప్రతిభా పరీక్షల్లో గాయత్రి సత్తా



ప్రజాశక్తి -రావికమతం: రాష్ట్రస్థాయి తెలుగు ప్రతిభ పరీక్షల్లో మరుపాక ఆదర్శ పాఠశాల విద్యార్థిని ద్వితీయ ర్యాంకులో నిలిచిందని ప్రిన్సిపాల్ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీల్ మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో అనేక పాఠశాలల నుంచి తెలుగు ప్రతిభ పరీక్షలలో పాల్గొనడం జరిగిందన్నారు. ఇందులో తమ ఆదర్శ పాఠశాల నుంచి 9వ తరగతి చదువుతున్న కే.గాయత్రి ఈ పరీక్షల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

వరి పైరుపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో సత్యవరం, మొక్క కృష్ణాపురం గ్రామాలలో వ్యవసాయ అధికారి ఎం.వాసుదేవరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరి క్షేత్ర సందర్శన చేశారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫెంగల్ తుఫాను కారణంగా గత 3 రోజులలో మండలంలో 28.4 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. తుఫానుకు ముందు కోత కోసి ఆరబెట్టిన వరి పనలు తడిచి పోయాయని, తడిచిన పనలపై 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయడంతో వరి మొలకెత్తడం, రంగు మారడం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మొక్క కృష్ణాపురం సర్పంచ్ వడ్డాది చారిమతి దేవి, స్థానిక నాయకులు జెర్రిపోతుల సూర్యనారాయణ, గట్రెడ్డి శ్రీను రైతులు పాల్గొన్నారు.

పీఎం పసల్ బీమా వినియోగించుకోవాలి

గొలుగొండ:మండలంలోని రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి తెలియజేశారు. మంగళవారం చోద్యం అర్బికే కేంద్రంలో పీఎం ఫసల్ భీమా యోజన పథకం అవగాహన సదస్సు జరిగింది. టాటా ఏఐజి డివిజన్ కోఆర్డినేటర్ రాజుబాబు ఈ పథకం వివరాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రైతులు, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

వరి పంటలు పరిశీలన

రావికమతం:తుఫానుకు తడిచిన వరి పంట చేనుకు ఉప్పు నీటితో స్ప్రే చేయడంతో గింజ పాడవకుండా ఉంటుందని మండల వ్యవసాయ అధికారిని రూప తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కోసి తడిసిన వరి పంటను పరిశీలించారు. రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తుఫాను హెచ్చరిక సందర్భంగా మూడు రోజుల ముందుగానే వరి కోతలు కోయరాదని రైతులకు తెలియపరచడం జరిగిందన్నారు. 95శాతం మేర వరిని కోయలేదని తెలిపారు. ఈదురు గాలులతో వీచిన వర్షానికి పండిన పంట గింజ బరువు కావడంతో అనేక చోట్ల నేల కొరిగాయన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



రావికమతంలో వరి చేనును పరిశీలిస్తున్న ఎఒ



రైతులతో మాట్లాడుతున్నఉద్యానవన శాఖ అధికారి

ఉద్యానవన పంటల పరిశీలన


ప్రజాశక్తి-రావికమతం:తుఫాన్ నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో సాగులో ఉన్న ఉద్యానవన పంటలకు ఎటువంటి నష్టం లేదని ఉద్యానవన శాఖ అధికారి భాను పుష్ప లీలావతి తెలిపారు. రావికమతం, బుచ్చయ్య పేట మండలాల్లో సాగులో ఉన్న కాయగూరలు, పండ్ల తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లా డుతూ వర్షాలతో కాయగూరల పంటలను ఆశించిన కుళ్ళు తెగులు నివారణకు కాపర్ ఆక్సిడ్ క్లోరైడ్ మూడు గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు.

రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి



మాట్లాడుతునున్న తహశీల్దార్

ప్రజాశక్తి-కోటవురట్ల:రెవిన్యూ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని తహసిల్దారు తిరుమలబాబు తెలిపారు. మంగళవారం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా రీ సర్వే సమయంలో జరిగిన తప్పుల సవరణలు, పరిష్కారం పట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. 805 ఫిర్యాదులు అందగా దాదాపు 200 వరకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సాగునీటి వినియోగ పన్ను వసూళ్ల పై నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఇటీవల రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో రెవిన్యూకు సంబంధించి 20 వరకు ఫిర్యాదులు అందగా వాటి పరిష్కారం పట్ల సిబ్బందితో చర్చించారు. త్వరలో జరగనున్న రెవెన్యూ సభలకు సంబంధించి రికార్డులు సిద్ధం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, మండల సర్వేయర్ శ్రీనివాస్, సిబ్బంది గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న డిసిహెచ్ఎ

సిహెచ్‌సిని తనిఖీ చేసిన డిసిహెచ్ఎ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -మాడుగుల్మాడుగుల సిహెచ్సిని వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు ఏ రకంగా వైద్యం అందుతుందన్న దానిపై ఆరా తీశారు. సమస్యలపై కూడా అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. ఆయన వెంట సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యులు సంతోష్ కుమార్ ఉన్నారు.

మహాలక్ష్మినాయుడుకు ప్రశంసాపత్రం ప్రదానం

ప్రజాశక్తి -రావికమతం:రావికమతం మండలంలో దివ్యాంగులకు అందిస్తున్న సేవలను గుర్తించి మేడివాడ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడికి అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా అనకాపల్లి గవరపాలెం రైతు భారతి కళ్యాణ మండపంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి చేతుల మీదుగా తమకు ప్రశంస పత్రాన్ని అందజేయడం జరిగిందని మహాలక్ష్మి నాయుడు తెలిపారు.అంకితభావంతో పనిచేసిన ప్రతి ఉద్యోగికి మంచి గుర్తింపు ఉంటుందని ఆమె తెలిపారన్నారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వయోవృద్ధుల ట్రాన్స్ జెండర్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న జెసి, అసిస్టెంట్ డైరెక్టర్, చైర్మన్



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆశా వర్కర్లకు అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ శ్యాంకుమార్ ఆధ్వర్యంలో సీహెచ్ఓ ప్రసాద్ ఆశ వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో వ్యాధిగ్రస్తులను గుర్తించి వారిని ఆసుపత్రులకు తీసుకొచ్చేలా చూడాలన్నారు.